ఆలయాల అభివృద్ధికి కృషి



బోడుప్పల్: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ శ్రీసాయిరాంనగర్ కాలనీలోని సీతారామాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఆయన సొంత నిధులతో ఆర్‌ఎంసీ కాంక్రీట్‌తో రోడ్డు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించేందుకు కృషి చేయాలని, దైవ చింతనతో జీవించాలని సూచించారు. బోడుప్పల్ ఈస్ట్ జోన్ బీజేపీ అధ్యక్షుడు ఏర్పుల మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాసాల నర్సింగ్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్, శ్రీసాయినగర్ కాలనీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్, సంతోష్, శరత్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి !

ఓపెన్ జిమ్‌ల పర్యవేక్షణ కరువు



ఉప్పల్: రూ.కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నెలలు గడవక ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. జిమ్ చేసేందుకు వస్తున్న వారికి నిరాశే ఎదురవుతోందని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అనేక పరికరాలు పనిచేయడం లేదని, దీంతో జిమ్ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకుని నిర్వహణ బాధ్యతను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సన్మానం



మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఎండీ అబ్దుల్‌అమీర్ (అజ్జు)ను బోడుప్పల్ మజీద్ కమిటీ సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు ఇస్లాం పఠాన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్, ప్రధాన కార్యదర్శి అజ్గర్, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ గౌస్ పాషా, కోశాధికారి ఆసిఫ్‌అలీషేక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



పాత వస్తువులను సేకరిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

కాప్రా/మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లే పాత వస్తువులను సేకరించేందుకు ట్రిపుల్ ఆర్ పేరుతో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం కాప్రా, మల్లాపూర్ డివిజన్‌లో పలు కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ పాత ఎలక్ట్రిక్ వస్తువులు, పాత సైకిళ్లు, పాత పుస్తకాలు, బట్టలు, బాటిళ్లను సేకరించి ట్రిపుల్ ఆర్ కేంద్రానికి తరలించారు. శానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, శానిటరీ జవాన్ కృష్ణ, అశోక్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



మౌలాలి: ఉర్సు సందర్భంగా హజరత్ అలీ దర్గాలో పోతుల ఉమామహేశ్వరి వినోద్‌యాదవ్, స్థానిక దర్గా నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లి ఆంజనేయులు, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ సీనియర్ నేత పిల్లి మోహన్‌యాదవ్‌కుటుంబసభ్యులతో కలిసి దర్శనం చేసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఉప్పల్: యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి అన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఆర్టీఏ అధికారి రవీందర్‌రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా తీసుకునే చర్యలపై వీడియో ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ డా.విజయకుమార్, అధికారులు సోమ్‌నాథ్, ఐజయ్య ఉన్నారు.



ఆర్టీఏ అధికారి రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శివారు కాలనీల్లో సమస్యల తిష్ట!

- పెరుగుతున్న కాలుష్యంతో ఇబ్బంది
- రెసిడెన్షియల్ జోన్‌లో కమర్షియల్ షెడ్‌లు,
- అగ్ని ప్రమాదాలతో భయాందోళనలో స్థానికులు
- అభివృద్ధికి నోచుకోని నగర శివారు కాలనీలు



అగ్నికి ఆహుతవుతున్న ఎలక్ట్రికల్ గోడౌన్ (ఫైల్)



వంపుగూడ శ్రీలక్ష్మీనగర్ కాలనీలో మట్టిరోడ్డు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధి రామకృష్ణానగర్ కాలనీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కాలనీ ఏర్పడి 55 ఏళ్లు అవుతున్నా.. ఇప్పటి వరకు మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టలేదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన చిన్న, మధ్యతరగతి పరిశ్రమలతో కాలుష్యం పెరుగుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల కాలుష్యంతో స్థానికులు అంటువ్యాధులు, శ్వాసకోశ సంబంధమైన వ్యాధుల భారిన పడుతున్నారు.

◆ సర్వేనంబర్ 128, 129, 135, 136, 137,138లోని 72 ఎకరాల్లో కాలనీ 1967లో ఏర్పాటు కాగా.. 500కు పైగా ప్లాట్లు ఉన్నాయి. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఈ కాలనీ చివరగా ఉంటుంది. నగర పాలక సంస్థ ఇప్పటి వరకు రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎలాంటి తాగునీటి సౌకర్యాలు లేవని స్థానికులు చెబుతున్నారు. కాలనీ మొత్తం మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు శానిటేషన్ సిబ్బంది రాలేదని అంటున్నారు.

కమర్షియల్ జోన్‌గా..

◆ కాలనీలో ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడంతో ప్లాట్ల యజమానులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకోలేదు. దీంతో రామకృష్ణానగర్ చిన్న, మధ్యతరగతి పరిశ్రమలతో కమర్షియల్ జోన్‌గా మారింది. అల్యూమినియం, ఇనుప షీట్లు, ప్లాస్టిక్ వ్యర్థాల పరిశ్రమలు, కెమికల్ డ్రమ్స్ వాషింగ్, ప్లాస్టిక్ వ్యర్థాలను శుద్ధి చేయడం, వాటిని కరిగించి తయారు చేసే పరిశ్రమలు ఉన్నాయి. వాటితో విష వాయువులు వెదజల్లుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనుమతి లేకుండా పరిశ్రమల ఏర్పాటు..

◆ రామకృష్ణానగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా 150కు పైగా చిన్న,మధ్యతరగతి పరిశ్రమలను ఏర్పాటు చేశారు. వీటి వల్ల నగర పాలక సంస్థ పెద్ద ఎత్తున ఆదాయాన్ని కోల్పోతుంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

◆ 2022 డిసెంబర్‌లో కొందరు వ్యక్తులు రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని మత్తు పదార్థాలు తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి వారి నుంచి కోట్లాది రూపాయల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

అగ్ని ప్రమాదం..

ఇటీవల రామకృష్ణానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వాహనాల గోడౌన్‌లో ఈనెల 4న అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.8 కోట్ల విలువైన ఎలక్ట్రికల్ వాహనాలు దగ్ధమై బూడిదయ్యాయి.

సమస్యలను పట్టించుకునేదెవరు..?

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న కొద్ది నగర శివారు ప్రాంతాల్లో కొత్త కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. నగర విస్తరణకు అనుగుణంగా అభివృద్ధికి మాత్రం నోచుకోవడంలేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంపుగూడలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. అంతర్గత రోడ్ల నిర్మాణానికి నోచుకోవడంలేదు. అంతర్గత రహదారులు సరిగ్గా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

వీధిదీపాలు లేక..

రాత్రి వేళల్లో కాలనీ రోడ్లపై ప్రయాణించాలంటే వీధి దీపాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

అధికారులు, ప్రజాప్రతినిధులకు మా సమస్యలపై అనేకసార్లు ఫిర్యాదు చేశాం. ఎప్పుడు రోడ్డు వేస్తారో అర్థం కావడం లేదు. రోడ్లు లేకపోవడంతో చీకటి పడితే బయటకు వెళ్లలేకపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల సమస్యను పరిష్కరించాలి.

– సుబ్బలక్ష్మి, స్థానికురాలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: కళ్యాణపురి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నిఖిల్ తెలిపారు. జహీర్‌నగర్, బ్యాంక్ కాలనీ, ఇందిరానగర్, అంబేడ్కర్‌నగర్, సీతారామకాలనీ, రాఘవేంద్రనగర్, టీచర్స్ కాలనీ, అజమత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. అల్వాల్ సబ్‌స్టేషన్ 11కేవీ 24గంటల వాటర్ ట్యాప్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు దినకర్‌నగర్, జోషినగర్, తిరుమల సిటీ, రాంచంద్రయ్య కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని, మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ 11కేవీ కృష్ణనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు కృష్ణనగర్, సూర్యనగర్, చంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ గంగాభవానీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఫీడర్ పరిధిలోని చైతన్య కళాశాల, కమలానగర్, ఈసీఐఎల్ బస్‌స్టాప్ ఎదురు వీధి సత్తిరెడ్డి గల్లి, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, మహేష్‌నగర్, జీహెచ్‌ఎంసీ కాప్రా కార్యాలయం, అయ్యప్పస్వామి ఆలయం వీధి, సౌత్ కమలానగర్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, గాంధీనగర్ ఫీడర్ పరిధి గాంధీనగర్, ఈస్ట్ ప్రగతినగర్, ఎస్పీనగర్, చందన్‌బాగ్, అంబానగర్, గాయత్రీనగర్ రోడ్డు నెంబర్లు 1 నుంచి 5, ఎంజే కాలనీ రోడ్డు నెంబర్లు 4 నుంచి 7, 9, హిల్ వ్యూ అపార్ట్‌మెంట్, బాంబే హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: హబ్సిగూడ 11కేవీ రవీంద్రానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు సీఐఎస్‌సీఈ, రవీంద్రానగర్, సెయింట్ జోసెఫ్ స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఏఈ గణేష్ తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ ధరణి ఫీడర్, కెనరానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మత్తుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 1.30 వరకు పీఅండ్‌టీ కాలనీ, భరత్ పురికాలనీ, బుద్ధానగర్, వరంగల్ హైవేలో కరెంట్ ఉండదని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ ఎస్‌బీఎస్ ఫీడర్ చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



బండబావి వద్ద ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలో నిర్మించ తలపెట్టిన మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఇటీవలే కార్పొరేటర్ ప్రభుదాస్ జీహెచ్‌ఎంసీ కమీషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించ తలపెట్టిన బండబావిని కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు, కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. బండబావి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనువైన స్థలమని చెప్పారు. దీనిపై అధికారులు దృష్టి సారించి కాంప్లెక్స్ నిర్మాణ పనులు ముందుకు సాగేలా చూడాలన్నారు. గతంలోనే ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎస్‌ఈల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు డీఈలు రవీందర్, ఉమామహేశ్వరి, రూప, ఏఈలు లింగారావు, భరత్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించండి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

కుషాయిగూడ: డివిజన్ సమస్యలపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిశారు. డివిజన్‌లోని డెక్కన్‌కాలనీ, నేతాజీనగర్, గణేష్‌నగర్, లక్ష్మీనగర్, వెంకట్‌రెడ్డినగర్, వీఎన్‌రెడ్డినగర్, బీఎన్‌రెడ్డినగర్, నాగార్జుననగర్, సోనియాగాంధీనగర్, ఐజీకాలనీ, హనుమాన్‌నగర్ కాలనీ, చక్రిపురం కాలనీల్లో అత్యవసరంగా యూజీడీ లైన్స్ మంజూరీ చేయాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు. పూడికతీత పనులు సమర్థవంతంగా చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని విన్నవించారు.సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే యూజీడీ పనులపై అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడకు చెందిన మండా సురేష్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో సురేష్ మెటల్ ఫినిషర్ ప్రైవేట్ లిమిటెడ్, మణిదీప్ టెక్నో కోట్స్ ఇండస్ట్రీస్‌తో పారిశ్రామిక ప్రగతి కోసం చేస్తున్న కృషిని అభినందిస్తూ.. యూఎస్ఏలోని మేరీల్యాండ్ యూనివర్సిటీ ఆయనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ బిజినెస్ అవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి



కాప్రా తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

కాప్రా: వంపుగూడలోని 104 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని శుక్రవారం కాప్రా తహసీల్దార్ సుచరితకు కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు భూకబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని లే ఔట్లు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్, కాంగ్రెస్ నేతలు మల్లారెడ్డి, బాబురావు, సత్యనారాయణ, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు

- ప్రజలకు ఇబ్బంది లేకుండా స్థల సేకరణ
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబిత

గౌతంనగర్: గౌతంనగర్ రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా స్థల సేకరణ చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గౌతంనగర్ రైల్వే గేటు వద్ద రైల్వే, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్‌తో పాటు ప్రాజెక్టు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖ, జలమండలితో పాటు ఇతర శాఖల అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఆర్‌యూబీ స్థల సేకరణ జరపాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈఈ రోహిత, డీఈ సుదర్శన్, రైల్వే డివిజనల్ ఈఈ జగదీష్, సెక్షన్ ఈఈ ప్రకాష్, మల్కాజిగిరి సర్కిల్ డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, విద్యుత్‌శాఖ అధికారులు, ఏడీఈ బాగయ్య, ఏఈ ప్రతిమ, వాటర్‌వర్క్స్ అధికారి డీజీఎం ఆశ్రిత, మేనేజర్ నవీన్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సంగీత, డీఆర్‌యూసీసీ సభ్యులు నూర్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం వెంకటాపురం, అల్వాల్ డివిజన్లకు చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెక్కులను అందచేశారు. ఆయన మాట్లాడుతూ.. తన కార్యాలయంలో సీఎం ఆర్‌ఎఫ్ కోసం ప్రత్యేక బృందం పనిచేస్తోందని, అర్హులందరికీ ఎంఆర్‌ఎఫ్, ఎల్‌వోసీలను ఇప్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే సీఎం సహాయనిధి ద్వారా అధికంగా లబ్ధిపొందిన నియోజకవర్గాల్లో మల్కాజిగిరి మొదటి స్థానంలో ఉందన్నారు. కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్‌గౌడ్, నాయకులు అనిల్‌కిషోర్, శరణగిరి, రహ్మత్‌ఖాన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అల్వాల్: అల్వాల్‌లోని వాసవీక్లబ్ హాల్‌లో తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కేలండర్, డైరీని శుక్రవారం రిటైర్డ్ ఉప విద్యాధికారి ముకుందరావు, రిటైర్డ్ తహసీల్దార్ బాలరాజులు హాజరై సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. సంఘం అధ్యక్షులు తులసి సత్యానారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్, శివశరణప్ప, పెద్దన్న, రాజేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్‌లలో స్థానిక మేయర్ అమర్‌సింగ్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్‌లోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు,వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ శశాంక
- రైతు ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: అర్హులకు సంక్షేమ పథకాలను అందించే దిశగా జిల్లా అధికార యంత్రాంగం పని చేయాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక అన్నారు. శుక్రవారం నగర శివారు శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబర్ ప్రకారం వ్యవసాయానికి అనుకూలమైన భూములపై స్పష్టతను ఇవ్వాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను నిర్వహించాలన్నారు. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ భూమికి మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా చెల్లిస్తుందని తెలిపారు. సాగుకు యోగ్యం కాని భూముల జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలన్నారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితాను పరిశీలించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీలో కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారన్నారు. వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

◆ జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారురాలు పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూముకుంటలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరి, డీఆర్‌డీఏ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుగుణబాయి, హౌజింగ్ పీడీ రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, ఎంపీడీఓ సుగుణ బాయి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అల్వాల్: అన్న కూతురిని ప్రేమించాడన్న కోపంతో ప్రేమికుడి ఇంటిపై పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం గోపాల్‌నగర్ ఎరుకల బస్తీలో నివాసం ఉండే ప్రకాష్, హేమలత దంపతులు కుమారుడు ప్రదీప్‌తో కలిసి ఉంటున్నారు. కాగా తన అన్న కూతురిని ప్రదీప్ ప్రేమిస్తున్నాడని కక్షతో వివేకానంద తన స్నేహితులు పవన్, ఎల్లేష్‌లతో కలిసి ఈనెల 14న ప్రదీప్ ఇంటికి వచ్చి తన తండ్రి ప్రకాష్, ఇంటి తలుపులపై పెట్రోల్ చల్లి నిప్పటించాడు. ఈ ఘటనలో ప్రకాష్‌కు మంటలు అంటుకోగా.. పక్కింట్లో ఉండే చిన్నారి చాందిని (4) రెండు కాళ్లకు మంటలు అంటుకున్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రకాష్ శుక్రవారం మృతి చెందాడు. నిందితులు ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.

ప్రజలకు అందుబాటులోకి వైద్య సేవలు

ఎట్టకేలకు ప్రారంభమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వైద్య సిబ్బందితో జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి

అల్వాల్: అల్వాల్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దాతలు ఇచ్చిన భవనంలో ఏడు దశాబ్దాలుగా వైద్య సేవలు అందించిన భవనం పురాతనమైనది కావడంతో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం తాత్కాలికంగా వెంకటాపురంలోని బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చి గత కొంతకాలంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇటీవల జిల్లా అభివృద్ధి సమన్వయం, మానిటరింగ్ కమిటీ దిశా సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలు ఆరోగ్యకేంద్రం ప్రారంభోత్సవంపై చర్చించారు. జిల్లా మానిటరింగ్ కమిటీ సూచనల మేరకు శుక్రవారం నూతన భవనంలో వైద్య సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి మాట్లాడుతూ.. పిల్లలు, గర్భిణులు, వృద్ధులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య కేంద్రం తగిన చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సదుపాయాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

వైద్య సేవలు ప్రారంభించినందుకు ధన్యవాదాలు..



ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అభివృద్ధి, మానిటరింగ్ కమిటీ సమావేశంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గురించి చర్చించాం. ఆరోగ్యకేంద్రం అందుబాటులోకి వచ్చి ప్రజలకు వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాను. ప్రజల ఆరోగ్యంపై అధికారులు స్పందించి వైద్యసేవలు ప్రారంభించినందుకు ధన్యవాదాలు.

– ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి